క్లుప్తంగా

సన్మానం



కలెక్టర్ను సన్మానిస్తున్న ఏపీఆర్ఎస్ఏ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఈనెల 17న రెవెన్యూ ఉద్యోగుల కార్తీక వన భోజన కార్యక్రమానికి అడిగిన వెంటనే అనుమతులు ఇచ్చి విజయానికి కృషి చేసిన ఉన్నతాధికారులను ఏపీఆర్ఎస్ఏ సన్మానించింది. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సి.నాగరాజు, ఎం.లక్ష్మీరాజు, ట్రెజరర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, ఆర్డీఓ సందీప్‌కుమార్, డీఎస్ఓ రాజారఘువీర్, కలెక్టరేట్ ఏఓ విజయశ్రీలను వారివారి కార్యాలయాల్లో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లోకేశ్వరి, కర్నూలు డివిజన్ అధ్యక్షుడు రామాంజనేయులు, ట్రెజరర్ సహరభాను పాల్గొన్నారు.

ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీలపై శ్వేత పత్రం విడుదల చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి డిమాండ్ చేశారు. శనివారం సీఆర్ భవన్‌లో ఫిబ్రవరి 6 నుంచి 9 వరకు శ్రీకాకుళంలో జరిగే ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ఉద్యోగాలు ఇవ్వని పక్షంలో నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తానని చెప్పి మోసం చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబయ్య, బీసన్న, షాబీర్‌బాషా, చంటి, గోపీ, కుమార్, అస్లాం, కృష్ణ పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీషర్టుల పంపిణీ



క్రీడాకారులతో ఒలింపిక్ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

కర్నూలు (టౌన్): ఈనెల 25న అనంతపురం జిల్లా నార్పలలో నిర్వహించనున్న 43 వ సబ్ జూనియర్, జూనియర్ బాల బాలికల రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ చాటాలని జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. అనంతపురం బయలు దేరుతున్న క్రీడాకారులకు శనివారం స్థానిక రైల్వే స్టేషన్ ప్రాంగణంలో టీ షర్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి బి.ఈశ్వర్ నాయుడు పాల్గొన్నారు.

మరుగు దొడ్ల కష్టాలు

- ట్రెజరీ స్ట్రాంగ్ రూమ్ భద్రతా సిబ్బందికి చెప్పుకోలేని బాధలు



స్ట్రాంగ్ రూమ్ భద్రతలో ఉన్న ఏఆర్ పోలీసు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా పరిపాలన కేంద్రమైన కలెక్టరేట్‌లోని ట్రెజరీ స్ట్రాంగ్ రూమ్ భద్రతా సిబ్బందికి మరుగు దొడ్ల కష్టాలు తప్పడి లేదు. ఇక్కడ 24 గంటల పాటు ఏఆర్ పోలీసుల భద్రత ఉంటుంది. ప్రతి మూడు గంటలకు ఒకరు షిఫ్ట్ మారుతూ ఉంటారు. వీరు బాత్ రూమ్, టాయ్‌లెట్ అవసరాల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు ఉన్నా వాటిలో నీరు రాకపోవడంతో మరుగున పడిపోయాయి. స్ట్రాంగ్‌రూమ్‌కు కాపలా ఉండే పోలీసుల వసతి గురించి చొరవ తసుకోవాల్సిన బాధ్యత ట్రెజరీ అధికారులపై ఉన్నా.. వారు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ప్రకారం ట్రెజరీ స్ట్రాంగ్ రూమ్ వదలి బయటికి వెళ్లరాదు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లడం తప్పడం లేదు. ఇప్పటికై స్ట్రాంగ్ భద్రత సిబ్బంది సదుపాయంపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతో ఉంది.

నేడు రాజపుత్ బొందిలి వన భోజనాలు

కర్నూలు(అర్బన్): ఈనెల 24న జిల్లా రాజపుత్ బొందిలి కుల బాంధవుల యువజన సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సంఘం నేతలు శనివారం ఒక ప్రకటన లో పేర్కొన్నారు.స్థానిక జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న యునైటెడ్ క్లబ్ ఆవరణలో ఉదయం 9.30 గంటలకు ఈకార్యక్రమం ప్రారంభమవుతుందని జిల్లా లోని రాజపుత్ బొందిలి సామాజిక వర్గానికి చెందిన కుటుంబ సభ్యులు హాజరు కావాలని కోరారు.

నేడు జబర్దస్త్ హాస్య వల్లరి

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు జబర్దస్త్ కళాకారులచే హాస్య ప్రదర్శన ఉంటుందని కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. కళాకారులు అప్పారావు, వినోదిని, గుండు మురళీధర్, నవీన్, ఎస్ఆర్ఎస్ ప్రసాద్ పాల్గొంటారన్నారు.

ఎన్‌సీసీ శిక్షణ ..భవితకు నిచ్చెన

- విద్యార్థుల్లో దేశభక్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తున్న వైనం
- ఎన్‌సీసీలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్న యువత
- సికింద్రాబాద్, ఢిల్లీ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్న కేడెట్లు
- నేడు ఎన్‌సీసీ దినోత్సవం



సికింద్రాబాద్‌లోని ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంప్‌లో పాల్గొన్న కర్నూలు సిల్వర్ జూబ్లీ కాలేజీ కేడెట్లు



డ్రిల్ ప్రాక్టీస్ చేస్తున్న కేడెట్లు

కర్నూలు కల్చరల్: విద్యార్థి దశ నుంచే దేశ భక్తి.. ఐక్యతా భావం.. నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో ఎన్‌సీసీ పాత్ర కీలకం. విద్యా సంస్థల్లో ఎంపిక చేయబడిన కేడెట్లకు సైనిక శిక్షణ ఇవ్వడంతోపాటు సామాజిక కార్యక్రమాల్లో ముందుండి నడిపించేలా తర్ఫీదు ఇస్తున్నారు. జిల్లాలోని పలువురు నేషనల్ కేడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) సికింద్రాబాద్, ఢిల్లీ స్థాయిలో ప్రతిభ కనబరుస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. ఏటా ఎన్‌సీసీలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

నవంబర్ నాల్గవ ఆదివారం ఎన్‌సీసీ డే

1948 జులై 15న నేషనల్ కేడెట్ కార్ప్స్ ఆవిర్భవించింది. అదే సంవత్సరం నవంబర్ ఢిల్లీలో మొదటి ఎన్‌సీసీ యూనిట్‌ను ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వడం ప్రారంభమైంది. దీంతో అప్పటి నుంచి ఏటా నవంబర్ నాల్గవ ఆదివారం ఎన్‌సీసీ డే నిర్వహిస్తున్నారు. ఎన్‌సీసీ దేశంలోనే అతి పెద్ద యువజన సంస్థ. భారత దేశ సైన్యంతో అనుబంధంగా ఉంటుంది. విద్యార్థులు, యువతలో ఆత్మ స్థైర్యం నింపడంతోపాటు జాతీయ భావాన్ని పెంపొందించడం, క్రమశిక్షణ, ధైర్య సాహసాలు, నాయకత్వ లక్షణాలు అందుకునేలా ప్రోత్సహిస్తున్నారు. సమాజ సేవ జాతీయ సమైక్యతా భావం కలిగిస్తుంది. విపత్తు సమయాల్లో ప్రజలకు సేవలు అందించేలా ఎన్‌సీసీ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు.

ఉన్నత చదువుల్లో ప్రత్యేక రిజర్వేషన్లు

ఎన్‌సీసీ సర్టిఫికెట్లు ఉన్న విద్యార్థులకు ఉన్నత చదువుల్లో ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుంది. పదో తరగతి స్థాయిలో ఎ- సర్టిఫికెట్, ఇంటర్ స్థాయిలో బి- సర్టిఫికెట్, డిగ్రీలో సి-సర్టిఫికెట్లు అందిస్తారు. సి- సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసిన వారికి మంచి అవకాశాలు వస్తాయి. ఆర్మీ, పోలీస్ ఉద్యోగాల్లో ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుంది. మెడికల్, ఇంజినీరింగ్, ఉన్నత చదువుల్లోనూ ఒక శాతం రిజర్వేషన్ ఉంటుంది.

9 (ఎ) గర్ల్స్ ఎన్‌సీసీ బెటాలియన్

ఈ బెటాలియన్‌లో 40 విద్యా సంస్థలు ఉన్నాయి. 8 సీనియర్ వింగ్స్‌లో 800 మంది, 32 జూనియర్ వింగ్స్‌లో 950 మంది కలిపి మొత్తం 1,750 మంది బాలికల ఎన్‌సీసీలో శిక్షణ పొందుతున్నారు.



➤ఈ చిత్రంలో ఉన్న యువతి పేరు రేష్మా. ఈమె 9 (ఎ) బాలికల పటాలం సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఎన్‌సీసీ విద్యార్థిని అయిన రేష్మా గత సెప్టెంబర్ నెలలో జమ్మూకశ్మీర్‌లో నిర్వహించిన ఈబీఎస్‌బీ(ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్) క్యాంప్‌లో పాల్గొని ప్రతిభ కనబరిచి డైరెక్టర్ జనరల్ ఎన్‌సీసీ ప్రశంసా పత్రం, పతకానికి ఎంపికైంది. రాష్ట్ర తరపున ఈ పత్రాలను సికింద్రాబాద్‌లోని ఎన్‌సీసీ కార్యాలయంలో ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్ చేతుల మీదుగా అందుకోనుంది.



➤ఈ చిత్రంలో ఉన్న మహిళ పేరు కె.సరోజమ్మ. ఈమె 9 (ఎ) బాలికల పటాలంలో సీనియర్ అసిస్టెంట్. బాలికల పటాలంలో అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈమె డైరెక్టర్ జనరల్ ఎన్‌సీసీ ప్రశంసా పత్రం, పతకానికి ఎంపికయ్యారు.

యువతలో దేశ రక్షణభావం కలుగుతోంది



యువతను క్రమశిక్షణ, దేశభక్తి గల పౌరులుగా తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ ప్రముఖ పాత్ర పోషిస్తోంది. ఆర్మీ, నేవీ, ఎయిర్ వింగ్‌లతో కూడిన ట్రై-సర్వీసెస్ ఆర్గనైజేషన్‌గా స్వచ్ఛందంగా పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. ఆసక్తి ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి ఫైరింగ్, డ్రిల్, నైట్‌మార్చ్, మ్యాప్‌రీడింగ్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఆర్‌డీసీ, టీఎస్సీ క్యాంపులకు పంపుతున్నాం. ఎన్‌సీసీ డేను పురస్కరించుకుని ఆదివారం రెడ్‌క్రాస్‌లో స్వచ్ఛంద రక్తదానం నిర్వహిస్తున్నాం.

– కల్నల్ జోబీ ఫిలిప్, కమాండిగ్ అధికారి 9 (ఎ) ఎన్‌సీసీ బాలికల పటాలం

ఆదానీపై జేపీసీతో విచారణ జరిపించాలి

కర్నూలు(సెంట్రల్): దేశ ప్రతిష్టతకు భంగం కలిగించిన కార్పొరేట్ కుబేరుడు అదానీపై పార్లమెంట్ జాయింట్ యాక్షన్ కమిటీతో విచారణ చేయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య సర్కిల్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడతూ ఆదానీ సంస్థలతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని స్టాంటన్‌పురంలో రూ.1.10 కోట్లతో నిర్మించిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యుకు సూచించారు. కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు, మున్సిపల్ ఎస్ఈ రాజశేఖర్, కార్పొరేటర్ సాంబశివరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్, మున్సిపల్ ఇంజినీర్ సత్యనారాయణ, డీఈఈ గిరిరాజు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

కర్నూలు (టౌన్): కల్లూరు ఏరియాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు తెలిపారు. శనివారం కమిషనర్ కల్లూరు ఎస్టేట్‌లో పర్యటించి కాలనీ అసోసియేషన్ నాయకులతో మాట్లాడారు. సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.ప్రజారోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, డీఈఈ క్రిష్ణలత, ఏఈలు ప్రవీణ్ కుమార్ రెడ్డి, భాను ప్రతాప్ పాల్గొన్నారు.

లింగ వివక్షపై అవగాహన కల్పించాలి

- రేపటి నుంచి 'నయీ చేతన' కార్యక్రమాలు
- జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య

కర్నూలు (సెంట్రల్): నయీ చేతన కార్యక్రమం ద్వారా లింగ వివక్షపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. శనివారం సాయంకాలం మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జెండర్ వివక్ష, వ్యతిరేకంగా కార్యాచరణకు సంబంధించి జిల్లాస్థాయి కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ లింగ వివక్షకు అవకాశం లేకుండా ఉండాలని పీఎన్‌డీటీ యాక్ట్‌ను అమలు చేయడం జరుగుతోందన్నారు. అమ్మాయిలకు 18 సంవత్సరాలు వయస్సు వచ్చే వరకు , వారు స్వతహాగా సంపాదించడం, కుటుంబ పోషణ చేసే స్థాయి చేరే వరకు వివాహం చేయడం మంచిది కాదన్నారు. ఇలా ఉన్నప్పుడు మహిళలపై హింస కూడా తగ్గే అవకాశం ఉందన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని, ఆ విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. గ్రామ, మండల స్థాయిలో కోర్ కమిటీలను ఏర్పాటు చేసి ఈ అంశాలపై ప్రజలను చైతన్యవంతులను చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. జిల్లా సమాఖ్య, అన్ని మండల సమాఖ్యలు, అన్ని గ్రామ సంఘాలు, అందరూ స్వయం సహాయక సంఘాల సభ్యులతో ప్రచారం నిర్వహించాలన్నారు. అన్ని శాఖల సమన్వయంతో లింగ వివక్ష, హింసకు వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహించాలని జేసీ ఆదేశించారు. ఈ నెల 25 నుంచి డిసెంబర్ 23వ తేదీ వరకు జెండర్ ఆధారిత హింస, ఆడపిల్లలకు విద్య, బాల్య వివాహాలు అరికట్టడం, గృహ హింస నిరోధక చట్టంపై కార్యక్రమాలు నిర్వహించాలని జేసీ ఆదేశించారు. ఈ సందర్భంగా జెండర్ వివక్ష, హింసకు వ్యతిరేకంగా మహిళా, పురుష అధికారుల చేత విడివిడిగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశానికి ఇన్‌చార్జ్ డీఆర్‌డీఏ పీడీ శివలీల, జాయింట్ డై రెక్టర్ సోషల్ వెల్ఫేర్ రంగలక్ష్మీదేవి, డీపీఆర్ఓ జయమ్మ, డీఈఓ శామ్యూల్ పాల్, ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ దీప్తి, జడ్పీ సీఈఓ నాసర రెడ్డి, పీడీ డ్వామా వెంకటరమణయ్య, అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసచారి, డీపీఓ భాస్కర్, నాగప్రసాద్ బాబు, డీఎంహెచ్ఓ, ఐసీడీఎస్ సూపరింటెండెంట్ ఉమా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ డాక్టర్ బి.నవ్య

ఘనంగా సత్యసాయి జయంతి



ఓల్డ్‌సిటీ ఇస్కాల సత్రంలో ప్రత్యేక అలంకారంలో సాయి నాథుని సన్నిధం



వేడుకల్లో పాల్గొన్న సాయి భక్తులు

కర్నూలు కల్చరల్: భగవాన్ సత్యసాయి బాబా జయంతిని శనివారం నెహ్రూ నగర్‌లోని శ్రీ సత్యసాయి మందిరంలో ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, పతాకావిష్కరణ, భజన కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయి బాబా వారికి అభిషేకం, కేక్ కటింగ్, భజన, మంగళహారతి, వేద పఠనం, ఝూల ఉత్సవం నిర్వహించారు. స్వామి సందేశం వినిపించారు. సాయి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సేవా సమితి జిల్లా అధ్యక్షులు కృష్ణారెడ్డి, కర్నూలు కన్వీనర్ మాకా అశోక్‌కుమార్, మహిళా విభాగం జిల్లా కన్వీనర్ లక్ష్మి సరోజ, సేవాదళ్ సభ్యులు సాయి సంధ్య, మాలతి, శారద, సాయిబాబా, వెంకటేష్, రత్నదీప్, యువజన విభాగం కన్వీనర్ సందీప్, వలంటీర్లు, భక్తులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
I.P.No: 50/2024
కె.రవికుమార్ ..అర్జీదారు
-VS-
ఎస్.వి.ప్రసాద్ వగైరా ..రెస్పాండెంట్లు
జనరల్ నోటీసు
కర్నూలు జిల్లా, కర్నూలు గ్రామము, 1వ టౌన్ ప్రజలకు తెలియజేయడం ఏమనగా పై నంబరు I.P.లో అర్జీదారు అయిన కటకం రవికుమార్ తండ్రి కె.రఘురామయ్య, మెడికల్ మరియు ఫైనాన్స్ హోల్‌సేల్ వ్యాపారం, ఇ.నెం. 3-36ఎ, ఉస్మానియా కాలేజీ రోడ్డు, కర్నూలు అనునతడు తనను దివాలా దారుగా తీర్మానించమని పై కోర్టులో దివాలా అర్జీ (I.P) దాఖలు చేసినాడు. ఇందుపైన ఎవరికైన ఆక్షేపణ ఉన్న 31.12.2024తేదిన పగలు 10:30 గం॥లకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేని యెడల పరోక్షమున విచారించి తీర్మానింపబడును.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
షేక్ ఖాదర్ బాషా
అర్జీదారు పరం అడ్వకేటు, కర్నూలు
సెల్: 98850 79849

PUBLIC NOTICE
ఇందుమూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నా క్లయింటు అయిన Mr. ఎన్.యశ్వంత్ కుమార్ తండ్రి నరహరి శేషఫణి గుప్త, R/O H.No. 87-2-2, శ్రీలక్ష్మీనగర్, బి.క్యాంప్, కర్నూలు సిటీ & జిల్లా వారి సూచనల మేరకు ఇచ్చు ప్రకటన ఏమనగా వారి తండ్రి గారు నరహరి శేషఫణి గుప్త గారు ఇదివరకులోనే అనగా 15-8-2024వ తేదీన Cardiac Arrest ద్వారా మరణించియున్నారు. ఆయన సమగ్ర శిక్ష నంద్యాల డివిజన్ యందు సైట్ ఇంజినీర్‌గా పనిచేయుచున్నారు. అయితే నా క్లయింట్ తండ్రి చనిపోవుట కంటే ముందురోజు అనగా 14-8-2024వ తారీఖున ఆయన ఆఫీస్ నుండి ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో ఆయనకు చెందిన (Carry Bag) బ్యాగ్‌ను పోగొట్టుకుని యున్నారు. తదుపరి ఆయన ఇంటికి వచ్చి చెక్ చేసుకొనగా పోగొట్టుకున్నారని తెలుసుకొని తన కుమారుడైన అనగా నా క్లయింటు వారితో కలిసి తాను వచ్చిన దారిలోనే వెదికియున్నారు. అయినప్పటికి బ్యాగ్ దొరకలేదు. మరుసటి రోజు పోలీస్‌స్టేషన్ (Police Station) నందు కంప్లయింట్ ఇద్దామనుకొని యున్నారు. ఈలోగా ఆయన 15-8-2024వ తేదీన మరణించియున్నారు. అయితే ఆయన చనిపోవుట కంటే ముందురోజు అనగా 14-08-2024వ తేదీన సదరు పోగొట్టుకున్న బ్యాగులో నా క్లయింటు వారి తండ్రి సంతకం చేసిన కొన్ని ప్రామిసరి నోట్లు (Promissory Note) సంతకం చేసిన కొన్ని బ్యాంక్ చెక్కులు (Bank Cheques) మరియు ఆఫీస్ ఫైల్స్ (Office files) ఉన్నాయని నా క్లయింట్ వారి తండ్రి గారు వారికి చెప్పియున్నారు.
అయితే నా క్లయింట్ వారి తండ్రి ఆకస్మిక మరణంతో దిగ్భ్రాంతికి లోనైన నా క్లయింట్ వారు కుటుంబసభ్యులు కొన్ని రోజుల వరకు ఏమి పాలుపోక దిక్కుతోచని స్థితిలోయున్నారు. తదుపరి క్రితం వారంలో నా క్లయింటు వారు పోలీస్ స్టేషన్ సంప్రదించి, సదరు బ్యాగు పోయిన విషయం తెలియపరచి కంప్లయింట్ (Complaint) చేయగా అందుకు పోలీస్‌వారు బ్యాగు పోయిన విషయం జరిగి చాలా రోజులైనందున వెతకటం చాలా కష్టమని తెలిపి కేసు తీసుకొనుటకు నిరాకరించియున్నారు. కావున సదరు బ్యాగుకాని అందులోని సంతకం చేసిన చెక్కులు (Promissory Note, Bonds) మరియు ఆఫీస్ ఫైల్స్ ఎవరికైన దొరికిన యెడల దిగువ తెలిపిన అడ్రస్సులో గాని (లేదా) నా క్లయింటు వారి అడ్రస్సులో గాని తెలియపర్చగలరు. అట్లుగాక సదరు సంతకం చేసిన Promissory Notes (Bonds), (Cheques) చెక్కులు మరియు ఆఫీస్ ఫైల్స్‌ని ఎవరైనా దుర్వినియోగ పరిచిన యెడల, అట్టివారిపై నా క్లయింటు తీసుకొనబోవు చట్టపరమైన చర్యలకు బాధ్యులగుదురు.
G.S.Vijaya Bhaskar Reddy, B.A.,B.L., Advocate
Address : H.No.87-1077, Ganesh Nagar, Nandyal Road, Near Partha Sarathi Towers, Kurnool.
Cell: 9347928866, 9985474567

న్యూమోనియాతో జాగ్రత్త

కర్నూలు(హాస్పిటల్): శీతాకాలంలో న్యూమోనియా బారిన పడకుండా చిన్నపిల్లలను జాగ్రత్తగా కాపాడుకోవాలని డెమో శ్రీనివాసులు సూచించారు. శనివారం స్థానిక ఇందిరమ్మ హౌసెస్ పరిధిలోని 93 సచివాలయంలో న్యూమోనియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డెమో శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 12 నుంచి 28వ తేదీ వరకు ×ప్రతి శ్వాస ముఖ్యమైనది-న్యూమోనియాను నివారిద్దాం ₹ నినాదంతో తల్లులకు న్యూమోనియాపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పిల్లలు దగ్గు, జలుబు, వేగంగా శ్వాస తీసుకోవడం, డొక్కలు ఎగరవేయడం, జ్వరం వంటి లక్షణాలుఉన్నప్పుడు వెంటనే సమీప ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించాలన్నారు. గర్భిణులకు, ఐదేళ్లలోపు క్రమం తప్పకుండా టీకాలు ఇప్పించాలని, దీనివల్ల తల్లులను, పిల్లలను వ్యాధుల బారి నుంచి కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



తల్లులకు అవగాహన కల్పిస్తున్న డెమో శ్రీనివాసులు

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

- మైనింగ్ డీడీ రవిచంద్

కర్నూలు న్యూసిటీ: ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని మైనింగ్ డీడీ రవిచంద్ హెచ్చరించారు. నదీతీర గ్రామాలు జి.సింగవరం, మునగాలపాడు, పంచలింగాల ప్రాంతాలను శనివారం ఆయన పర్యటించారు. ప్రజలతో మాట్లాడుతూ సొంత అవసరాలకు, గ్రామ అభివృద్ధి పనులకు మాత్రమే నది నుంచి ఇసుకను తరలించేందుకు ట్రాక్టర్లు, లారీలను అనుమతించాలన్నారు. అక్రమంగా తరలించే వాహనాలను అడ్డుకుని తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

26న కార్మిక సంఘాల మహాప్రదర్శన



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.మునెప్ప

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు, కార్మికులకు వ్యతిరేకంగా అవలంభిస్తున్న చర్యలను ఖండిస్తూ ఈనెల 26న మహాప్రదర్శన, ధర్నా, రాస్తారోకోలు నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప తెలిపారు. శనివారం ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు, కార్మికులు జిల్లా, మండల కేంద్రాల్లో నిర్వహించనున్న మహా ప్రదర్శన, ధర్నా, రాస్తారోకోల్లో పాల్గొనాలన్నారు. సమావేశంలో నాయకులు చంద్రశేఖర్, ఈశ్వర్, రహిమాన్, బీసీ మధు పాల్గొన్నారు.



మార్కెట్ యార్డులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

విజయవంతం చేద్దాం

కర్నూలు(అగ్రికల్చర్): ఈనెల 26న చేపట్టే ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, నగర అధ్యక్షుడు సాయిబాబ, మార్కెట్ యార్డు యూనియన్ అధ్యక్షుడు రాముడు కోరారు. శనివారం మార్కెట్ యార్డులో కోత, పట్టుబడి, లారీ హమాలీ యూనియన్లతో సమావేశమై మాట్లాడారు. మార్కెట్ యార్డులో ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ యార్డు యూనియన్ నాయకులు మనోహర్, కోదండరాముడు, మద్దిలేటి, మినల్లా, నాగరాజు, వలి, వెంకటస్వామి పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించండి

- డీఎస్పీ బాబు ప్రసాద్

ఓర్వకల్లు: పెండింగ్ కేసులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ ఆదేశించారు. శనివారం డీఎస్పీ బాబు ప్రసాద్ స్థానిక పోలీసు స్టేషన్‌ను పరిశీలించారు. రికార్డులు, స్టేషన్ పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డులను సిద్ధంగా వుంచుకోవాలని సూచించారు. అట్రాసిటీ కేసుల వివరాలపై ఎస్ఐ సునీల్‌కుమార్‌ను ఆరాతీశారు. పోలీసు సిబ్బంది పనితీరును మెరుగుపడేలా చూసుకోవాలని తెలిపారు. రోడ్డు భద్రత నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించి, రోడ్డు ప్రమాదాలను అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడిపే వాహనదారులపై తరచుగా తనిఖీలు నిర్వహించి, జరిమానాలు విధించాలని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ చంద్రబాబునాయుడు, ఎస్ఐ సునీల్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ బాబు ప్రసాద్

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి

కర్నూలు కల్చరల్: రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఏపీటీడీసీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ అన్నారు. శనివారం ఆయన వీఆర్ కాలనీలోని పున్నమి రెస్టారెంట్, ఓర్వకల్లు రాక్ గార్డెన్‌ను సందర్శించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. పున్నమి రెస్టారెంట్ ఆవరణలో ఉన్న డంప్ యార్డ్‌ను వీలైనంత త్వరగా తొలగించాలని ఆదేశించారు. గదుల పునరుద్ధరణ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. గార్గేపురం చెరువు వద్ద బోటింగ్‌ను తిరిగి ప్రారంభించాలన్నారు. చైర్మన్ వెంట బోర్డ్ డైరెక్టర్ ముంతాజ్‌బేగం, బెస్త సాధికార కమిటీ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, ఏపీటీడీసీ డీవీఎం చంద్రమౌళీశ్వర రెడ్డి, ఎస్ఈ ఈశ్వరయ్య, అకౌంట్స్ మేనేజర్ రామకృష్ణ, పున్నమి రెస్టారెంట్, ఓర్వకల్లు రాక్ గార్డెన్ మేనేజర్లు సతీష్, జీవన్ పాల్గొన్నారు.



పున్నమి రెస్టారెంట్ పరిసరాలను పరిశీలిస్తున్న ఏపీటీడీసీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ

కార్తీక దీపం.. శోభాయమానం



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: కార్తీక మాసం శనివారంను పురష్కరించుకొని వీఆర్ కాలనీలోని కమల్ రెసిడెన్సీలో కార్తీక దీపోవత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. మహిళలు అర్ధనారీశ్వరుడు, శంఖు ఆకారంలో రంగవళ్లులు, దీపాలను వెలిగించి పూజలు చేశారు.

WANTED TEACHERS
అలంపూర్ తాలూకాలో పేరెన్నికగన్న శాంతినగర్‌లోని శివ శివాని E/M హైస్కూలు నందు పనిచేయుటకు టీచర్లు కావలెను.
సబ్జెక్టులు : ఇంగ్లీష్, గణితం (4 నుండి 9వ తరగతి వరకు)
జీతం : 18,000/- (రోజు 75/- TA ఇవ్వబడును)
ఆసక్తి గలవారు (డెమో)కు హాజరు కాగలరు.
శివశివాని E/M హైస్కూల్.
శాంతినగర్, జోగులాంబ గద్వాల జిల్లా.
సెల్: 90107 02406.

ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించొద్దు

- ఈడీ(ఆపరేషన్స్) ఎ.అప్పలరాజు



మాట్లాడుతున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్)ఎ.అప్పలరాజు

కర్నూలు సిటీ: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉద్యోగులు చర్యలు తీసుకోవాలని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఆపరేషన్) ఎ.అప్పలరాజు సూచించారు. శనివారం ఆర్టీసీ శిక్షణ కాలేజీల్లో కర్నూలు, నంద్యాల జిల్లాల డిపో మేనేజర్‌లు, ట్రాఫిక్ ఇన్‌చార్జ్‌లకు ఆపరేషన్‌పైన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణానికి రిజర్వేషన్ చేసుకున్న వారు నిర్దేశించిన సమయానికి చేరుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఆదాయం తగ్గిన సర్వీసుల విషయంలో ప్రత్యేక దృష్టి సారిచాలన్నారు. ప్రతి సర్వీసు సమయపాలన పాటించాలన్నారు. హైయర్ బస్సు, ఆన్ కాల్ డ్రైవర్స్‌కు రెండు రోజుల ట్రైనింగ్‌లో పాల్గొని ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి టి.శ్రీనివాసులు, నంద్యాల జిల్లా ప్రజా రవాణా అధికారి రజియా సుల్తానా, డిప్యూటీ సీటీఎం కె.శ్రీనివాసరావు, జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

ఔషధ దుకాణాల్లో సోదాలు

కర్నూలు (హాస్పిటల్): నగరంలో శనివారం పలు ఔషధ దుకాణాల్లో అధికారులు విస్తృత సోదాలు నిర్వహించారు. రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ చౌడేశ్వరి తన సిబ్బంది, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, ఆయుష్ విభాగ మెడికల్ ఆఫీసర్లతో కలసి వివిధ ప్రాంతాల్లోని ఆయుర్వేద, అల్లోపతి మెడికల్ షాపుల్లో తనిఖీలు చేశారు. కొత్తబస్టాండ్ సమీపంలోని అపోలో ఫార్మసీలో అల్లోపతి మందులతో పాటు అనుమతి లేకుండా ఆయుర్వేద మందులను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. పాతబస్టాండ్‌లోని శ్రీసంజీవిని ఆయుర్వేదిక్ షాపులో జీఎంపీ సర్టిఫికెట్ లేని మూడు ఆయుర్వేద మందులను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. కొత్తబస్టాండ్ సమీపంలోని సిరిగిరి వెంకప్ప ఆయుర్వేదిక్ స్టోర్‌లో అనుమతి లేని కంపెనీల మందులను విక్రయిస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. పాతబస్టాండ్‌లోని మహావీర్ మెడికల్ ఏజెన్సీలో మందుల క్రయవిక్రయాల్లో తేడాలు, ఆయుష్ విభాగం అనుమతి లేకుండా మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నంద్యాలలో వెంకప్ప ఆయుర్వేదిక్ ఏజెన్సీని సందర్శించి బిల్లులు సరిగా లేని మందులను సేకరించారు. సంబంధిత వ్యాపారులపై కేసులు నమోదు చేసి చర్యలకు సిఫారసు చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కర్నూలు
70750 09182
Office mail : sakshiknladvt@gmail.com